క్లుప్తంగా

70 మందికి వైద్య పరీక్షలు



మచిలీపట్నం టౌన్: స్థానిక ఉదయపు నడక మిత్ర మండలి భవనంలో ఆదివారం యోగాసభ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. యోగా శిక్షణ తరగతుల అనంతరం వైద్యులు డాక్టర్ జీజీఎల్.శ్రావ్య యోగ సాధకులకు ఉచితంగా బీపీ, షుగర్, ఇతర వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి వైద్య సలహాలు, సూచనలు చేశారు. యోగా సభ్యులు, ఇతరులు కలిపి దాదాపు 70 మందికి వైద్య సేవలు అందించారు. యోగా గురువులు గురునాథ బాబు, మహాలక్ష్మి చింతయ్య, శాస్త్రి, విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మన్నెం భాస్కరరావు, సమాచార శాఖ ఉప సంచాలకులు ఎం.వెంకటేశ్వర ప్రసాద్, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి రమణ, యోగ సాధకులు తమ్మన సూర్యనారాయణ, ఆర్.డి.ప్రసాద్ తదితర యోగా సభ్యులు పాల్గొన్నారు. అనంతరం వైద్యురాలు శ్రావ్యను ఘనంగా సన్మానించారు.

ఈఈ భాస్కర్‌రావుకు సన్మానం



మచిలీపట్నంటౌన్: విద్యుత్ శాఖ మచిలీపట్నం సబ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మన్నెం భాస్కరరావు సేవలు మరువ రానివని పలువురు వక్తలు పేర్కొన్నారు. మచిలీపట్నం నుంచి మాచర్లకు బదిలీపై వెళుతున్న భాస్కరరావును యోగ సభ ప్రతినిధులు ఆదివారం ఘనంగా సన్మానించారు. నగరంలోని ఉదయపు నడక మిత్రమండలి భవనంలో ఉచిత యోగా శిక్షణ తరగతులు అనంతరం యోగా గురువులు గురునాథబాబు, చింతయ్య, యోగ సాధకులు, సమాచార శాఖ డెప్యూటీ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరప్రసాద్, శాస్త్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో యోగ సాధకులు తమ్మన సూర్యనారాయణ, పశుసంవర్ధక శాఖ అధికారి జీవీ రమణ, మహాలక్ష్మి, రాజకుమారి, ఆర్.డి.ప్రసాద్ తదితర యోగా సభ్యులు భాస్కర రావును అభినందించారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



పెడన: పారిశుద్ధ్య కార్మికులకు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా ఇవ్వాలని ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని రైతు బజారు, చేపల మార్కెట్ వద్ద స్వచ్ఛతాహీ సేవ–2024 కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పారిశుద్ధ్య పనులను చేపట్టారు. అనంతరం ఆయా ప్రాంత ప్రజలకు తడి, పొడి చెత్త, వేస్టుటు కంపోస్ట్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇన్‌చార్జి తహసీల్దారు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు తడి, పొడి చెత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాల్‌రావు, వార్డు ఇన్చార్జిలు, పారిశుద్ధ్య కార్మికులు, పర్యావరణ కార్యదర్శులు, వార్డు మేస్త్రీలు పాల్గొన్నారు.

520 మంది వరద బాధితులకు సాయం



చల్లపల్లి(అవనిగడ్డ): బాపట్ల జిల్లా భట్టిప్రోలుకు చెందిన వరద బాధితులకు చల్లపల్లి మండలం పురిటిగడ్డకు చెందిన ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ (ఐవీఎం) ఆధ్వర్యంలో 520 మంది వరద బాధితులకు రూ.5 లక్షల విలువైన దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. పురిటిగడ్డలోని ఐవీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఐవీఎం ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ వేములపల్లి సురేష్, రోజా దంపతులు వరద బాధితులకు వీటిని అందించారు. ఈ సందర్భంగా వేములపల్లి సురేష్ మాట్లాడుతూ లంక గ్రామాల్లో వరద బాధితులకు తన వంతు సహాయం అందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జాన్‌పాల్, పలువురు ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

పెడన: పురపాలక సంఘ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాలులో జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అజెండాలో పొందుపరిచిన తొమ్మిది అంశాలపై చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా ఆమె తెలిపారు.

ముంచిన అలసత్వం





పిల్లంకోడు డ్రెయిన్ పరిధిలో రెండోసారి నీటమునిగిన పంటను చూపిస్తున్న రైతులు (ఫైల్) : పిల్లంకోడు డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క

- పిల్లంకోడు డ్రెయిన్ పరిధిలో 1200 ఎకరాల్లో పంట మునక
- వరదల అనంతరం రెండోసారి వేసిన నాట్లు మునక
- అధికారుల అలసత్వం వల్లనే నష్టపోయామంటున్న రైతులు
- తూతూ మంత్రంగా డ్రెయిన్ పనులు

మంగళాపురం(అవనిగడ్డ): తూతూ మంత్రంగా పిల్లంకోడు డ్రెయిన్ పూడికతీత పనులు ఈ ప్రాంత రైతులకు శాపంగా మారాయి. వరదల కారణంగా ఒకసారి దెబ్బతిన్న నాట్లు, అధికారుల అలసత్వం వల్ల రెండోసారి వేసిన నాట్లు ముంపునకు గురవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రెండు సార్లు వరిపంట నీట మునగడంతో మొక్కలు కుళ్లిపోయి చనిపోతున్నాయని మంగళాపురం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

డ్రెయినేజీ పనులు చేసిందెక్కడ..

స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత నియోజకవర్గంలో ఒక్క ఎకరా పంట ముంపునకు గురికానివ్వనని స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా డ్రెయినేజీ పనులు చేస్తున్నామని గొప్పలు చెప్పారు. నియోజకవర్గంలో రూ.5 కోట్ల నిధులతో డ్రెయిన్లను ప్రక్షాళన చేశామని చెప్పుకొచ్చారు. ఈ మాటలు నీటిమీద రాతలేనని తేలిపోయింది.

రెండు వేల ఎకరాల్లో..

తీరా చూస్తే ఒకసారి కాదు రెండోసారి పంట ముంపునకు గురవడంతో చల్లపల్లి మండల పరిధిలోని మంగళాపురానికి చెందిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. 20 రోజుల క్రితం కురిసిన వర్షాలకు, వరదకు మాజేరు, మంగళాపురం పరిధిలో రెండు వేల ఎకరాలు ముంపునకు గురయ్యాయి. వారం రోజుల పాటు మురుగునీటిలో ఉన్న పొలాలు ఇటీవలె తేరుకున్నాయి.

ఇటీవల వర్షాలకు రెండోసారి..

ఐదు రోజుల క్రితం కురిసిన వర్షాలకు మంగళాపురంలో పిల్లంకోడు డ్రెయిన్ పరిధిలో ఉన్న 1200 ఎకరాలు రెండోసారి ముంపునకు గురయ్యాయి. మొదటి సారి మునిగిపోయినపుడు మొక్కలు దెబ్బతినడంతో రెండోసారి నాట్లు వేశారు. రెండోసారి కూడా ముంపు బారిన పడటంతో దిక్కుతోచడం లేదని కొంతమంది రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దెబ్బమీద దెబ్బ తగలడంతో కోలుకోలేని స్థితిలోకి వెళ్లారు.

అధికారుల అలసత్వమే కారణమా?

మొదటి సారి వచ్చిన భారీ వర్షాల తరువాత పూర్తి స్థాయిలో డ్రెయిన్లు బాగుచేయాలని స్థానిక ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అధికారులను ఆదేశించారు. డ్రెయిన్లలో పెద్ద ఎత్తున గుర్రపు డెక్క పేరుకుపోవడంతో కెమికల్ మందు పిచికారీ చేశారు. ఈ కార్యక్రమం మొక్కుబడిగా చేయడం వల్ల గుర్రపుడెక్క మళ్లీ ఏపుగా పెరిగింది. సమస్య మొదటికొచ్చింది. అధికారుల అలసత్వం వల్లనే మా పంటలు ముంపునకు గురయ్యాయని, ప్రభుత్వం పరిహారం అందించడంతో పాటు పిల్లంకోడు డ్రెయిన్‌ను పూర్తి స్థాయిలో పూడికతీయించాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

ఆలోచింపజేసిన సాహితీ సదస్సు





మాట్లాడుతున్న రచయిత, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ : కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు, రచయితలు

- ఆకట్టుకున్న ప్రకృతి వైపరీత్యాల కవి సమ్మేళనం
- అవనిగడ్డలో ఉమ్మడి కృష్ణాజిల్లా రచయితల 16వ మహాసభ

అవనిగడ్డ: కృష్ణా జిల్లా రచయితల 16వ మహాసభను పురస్కరించుకుని స్థానిక గాంధీక్షేత్రంలో నిర్వహించిన సాహితీ సదస్సు ఆలోచింపజేసింది. ప్రకృతి వైపరీత్యాలపై కవి సమ్మేళనం సాహితీ ప్రియులను ఆకట్టుకుంది. మాజీ మంత్రి మండలి వెంకట కష్ణారావు 27వ వర్ధంతిని పురస్కరించుకుని కృష్ణా జిల్లా రచయితల మహాసభ సందర్భంగా 'ప్రకృతి వైపరీత్యాలు– పర్యావరణ పరిరక్షణ– రయితల పాత్ర' అనే అంశంపై సాహితీ సదస్సు నిర్వహించారు. ప్రముఖ రచయిత అక్కినేని భవానీ ప్రసాద్, ఎస్పీ భారతి, డాక్టర్ జీవీ పూర్ణచంద్ ప్రసంగించారు. 'దివి సీమ ఉప్పెన' అంశంపై డాక్టర్ గుడిసేవ విష్ణుప్రసాద్, 'కొల్లేరు ముంపు కవుల ప్రతిస్పందన' అంశంపై చింతపల్లి వెంకట నారాయణ, 'జలవిజ్ఞానం, రచయితల పాత్ర' అంశంపై అంగత వరప్రసాదరావు, 'జలవనరుల వినియోగం రచయితల ప్రతిస్పందన'పై సరికొండ నరసింహరాజు ప్రసంగించారు. ఆదుర్తి సుహాసిని, మాదిరాజు శివలక్ష్మీ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. 'వచన కవితలు–ప్రకృతి వైపరీత్యాలు' అనే అంశంపై డాక్టర్ రావి రంగారావు, 50 ఏళ్ల కాలంలో తెలుగు మహాసభల ప్రభావం అనే అంశంపై గబ్బిట దుర్గారావు, 'ప్రాచీన సాహిత్యంలో ప్రకృతి పరిరక్షణ' అంశంపై విహారి చేసిన ప్రసంగం ఆలోచింపజేసింది. 'తెలుగు కథ–పర్యావరణ పరిజ్ఞానం' అంశంపై వల్లూరి శివప్రసాద్, 'ప్రకృతి ఉపద్రవాలు–రచయితల స్పందన'పై డాక్టర్ కప్పగంతు రామకృష్ణ, 'ప్రకృతి పరిరక్షణ–మహిళల పాత్ర'పై తేళ్ల అరుణ, 'చరిత్ర పుటలో వరద ముంపు' అంశంపై సవరం వెంకటేశ్వరరావు పత్ర సమర్పణ చేశారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం..

అనంతరం ప్రకృతి వైపరీత్యాలు అనే అంశంపై నిర్వహించిన కవి సమ్మేళనం కార్యక్రమానికి చలపాక ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా అక్కిరాజు సుందర రామకృష్ణ, ఆత్మీయ అతిథిగా మార్నె జానకి రామచౌదరి విచ్చేయగా 55 మంది కవులు పాల్గొన్నారు. తమ కవితా పాటవాన్ని చాటుకున్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన రచయితలు, కవులు, భాషాభిమానులు ఆద్యంతం ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా చిన్నారులతో రూపొందించిన నృత్యం వీక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

ఉత్సాహంగా పెయింటింగ్ పోటీలు



బహుమతులు, సర్టిఫికెట్లు అందుకున్న విజేతలతో డాక్టర్లు వీణ, రామ్‌ప్రసాద్ తదితరులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులో ఆదివారం రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యాన పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. చిన్నతనంలో వచ్చె పలు రకాల క్యాన్సర్‌పై అవగాహన నిమిత్తం ఏర్పాటు చేసిన ఈ పెయింటింగ్ పోటీల్లో నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు సుమారు 160 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ పీడియాట్రిక్ హేమాటో ఆంకాలజిస్ట్ డాక్టర్ అక్కినేని వీణ మాట్లాడుతూ పిల్లల ప్రాణాలు కాపాడటంలో తొలి దశలోనే క్యాన్సర్‌ను గుర్తించడం కీలకమన్నారు. లుకేమియా, లింఫోమా, బ్రెయిన్ క్యాన్సర్, బోన్ క్యాన్సర్ వంటి వాటికి అధునాతన చికిత్స పద్ధతులు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. రెయిన్‌బో హాస్పిటల్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ రామ్ ప్రసాద్ మాట్లాడుతూ క్యాన్సర్ చికిత్సలో వచ్చిన పురోగతితో వ్యాధితో బాధపడుతున్న పిల్లలు జీవించే అవకాశాలు గణనీయంగా మెరుగుపడ్డాయన్నారు. అనంతరం పెయింటింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ యూనిట్ హెడ్ గుణశేఖర్ చౌదరి, డెకాథ్లాన్ సిబ్బంది పాల్గొన్నారు.

ముస్తాబాద కోలాట సమాజానికి ప్రథమ బహుమతి



ప్రథమ బహుమతిని సాధించిన కోలాటం సమాజంతో గురువు చెన్నకేశవులు

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద శ్రీ దాసాంజనేయ కోలాట సమాజానికి ప్రథమ బహుమతి లభించింది. దసరా సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయిలో విజయవాడలో జరిగిన కోలాటం పోటీల్లో తెంపల్లికి చెందిన కోలాటం గురువు చిట్టూరి దుర్గా చెన్నకేశవులు ఆధ్వర్యాన ఈనెల 28న విజయవాడ పీవీ సిద్దార్థ కళాశాలలో జరిగిన పోటీల్లో సమాజం ప్రథమ బహుమతి సాధించింది. గురువు దుర్గా చెన్నకేశవులను, ఆయన తండ్రి చిట్టూరి గోపీని నిర్వాహకులు సన్మానించారు. కోలాటం కళ వ్యాప్తి చెందేందుకు చేస్తున్న కృషిని ప్రశంసించారు.

ఆహారం వృథా చేయరాదు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి వడ్డె శోభనాద్రీశ్వరరావు

ఉయ్యూరు: ఆహారం వృథా చేయకుండా ఆకలితో అలమటించే పేదల కడుపునింపాలని మాజీ మంత్రి వడ్డె శోభనాద్రీశ్వరరావు అన్నారు. లయన్స్‌జోన్–1 ఆధ్వర్యంలో ఆహార వృథా అవగాహన దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఆహార పదార్థాలు వృధా చేయొద్దంటూ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార వృధాపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా నిత్యం ఆహారం వృధా అవుతోందన్నారు. ప్రతిఒక్కరూ ఆహార పదార్థాలను వృధా చేయకుండా సద్వినియోగం చేయాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ జోనల్ చైర్‌పర్సన్ ఎండీ ఇస్మాయిల్, క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ, ప్రతినిధులు నెల్లి రాంబాబు, దీనవహి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలి మార్పుతోనే గుండె వ్యాధులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: మారిన జీవనశైలి, ఆహార అలవాట్లతో గుండె సంబంధిత సమస్యలు ఎక్కువవుతున్నాయని ప్రముఖ కార్డియాలజిస్ట్ వీరమాచినేని స్వరాజ్యం అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆదివారం అన్విసూపర్ స్పెషాలిటీ క్లినిక్, స్రవంతి ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక విజయవాడరోడ్డులోని స్రవంతి ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన వైద్య శిబిరంలో కార్డియాలజిస్ట్ స్వరాజ్యం, ప్రముఖ అంకాలజిస్ట్ పోలవరపు కల్యాణ చక్రవర్తి, డాక్టర్ తెర్లి సురేష్ రోగులకు వైద్య సేవలు అందించారు. గుండె సంబంధిత వ్యాధుల పట్ల డాక్టర్ స్వరాజ్యం అవగాహన కల్పించారు. నిత్యం క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా చేయడం వల్ల ఒత్తిడిని జయించవచ్చని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఉయ్యూరు: అనారోగ్యంతో బాధపడుతున్న బాధిత కుటుంబానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆసరాగా నిలిచింది. విజయవాడలోని ఎస్ఆర్ఆర్ కళాశాల సమీపంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న కొడాలి ఆంజనేయులు, తిరుపతమ్మ దంపతులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని మానవత సంస్థ ప్రతినిధులు కలిసి రూ. ఆరు వేలు ఆర్థిక సాయం అందించారు.

ప్లాస్టిక్ వస్తువులు వినియోగించొద్దు



పాయకాపురం(విజయవాడరూరల్): ప్లాస్టిక్ వస్తువులు వినియోగించొద్దని కళాజాత బృందం సూచించింది. స్వచ్ఛతాహీ సేవలో భాగంగా ఆదివారం విజయవాడ 64వ డివిజన్ కండ్రికలో వీఎంసీ కళాజాత బృందం ప్లాస్టిక్ వస్తువుల వినియోగం ద్వారా వచ్చే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రదర్శనలు ఇచ్చారు. ప్లాస్టిక్ కవర్లకు బదులు క్లాత్ సంచి, కర్రల సంచి వాడాలని సూచనలు చేశారు. ప్లాస్టిక్ కవర్‌కు మట్టిలో కలిసే గుణం లేదని తెలిపారు. అనంతరం స్థానికులతో కలిసి శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపీరాజు ప్లాస్టిక్‌ను తరిమి కొడదామని ప్రతిజ్ఞ చేయించారు.

సీఏ విద్యార్థినికి ఆర్థిక సాయం

మండవల్లి: పేదరికం వల్ల సీఏ చదువుకు ఫీజు చెల్లించేందుకు ఇబ్బందిపడుతున్న విద్యార్థినికి మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. మండలంలోని గన్నవరం గ్రామానికి చెందిన సీఏ విద్యార్థిని మండపాటి లక్ష్మీశరణ్యకు రూ.1.75 లక్షలు ఆర్థిక సాయం అందించినట్టు ఆ సంస్థ మండల అధ్యక్షుడు గుడివాడ గణేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. బొమ్మలూరుకు చెందిన నెక్స్‌జెన్ సంస్థ ఎండీ అడుసుమిల్లి వెంకటసుబ్రహ్మణ్యం ఆన్‌లైన్ ద్వారా ఈ సొమ్మును గుంటూరు కళాశాలకు జమ చేసినట్టు పేర్కొన్నారు. సహకారం అందించిన విద్యాదాతకు రాష్ట్ర శాఖ తరపున రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అభినందనలు తెలిపారు.

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి



నాగపుట్ట వద్ద పూజలు చేస్తున్న అప్పిరెడ్డి, రమేష్‌బాబు

మోపిదేవి: స్థానిక మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన అనంతరం నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. అర్చకులుస్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వీరివెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, జిల్లా పార్టీ కార్యదర్శి మోర్ల శ్రీనివాస రావు, మండల బీసీ సెల్ కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరావు, గరికిపాటి గోవిందరాజులు, లింగం జగదీష్‌కుమార్, తుటారం కృష్ణ పాల్గొన్నారు.

ప్రవక్త చూపిన మార్గం అనుసరణీయం



మాట్లాడుతున్న మౌలానా జైనుల్‌అబిద్దీన్

గూడూరు: మహ్మద్ ప్రవక్త చూపిన మార్గం అనుసరణీయమని మౌలానా జైనుల్‌అబిద్దీన్ అన్నారు. గూడూరు పఠాన్‌పేటలోని హజరత్ నీర్గన్‌షా అవల్యా దర్గాలో ఆదివారం రాత్రి మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన మౌలానా జైనుల్‌అబిద్దీన్ మాట్లాడుతూ సర్వమానవాళి శాంతి సౌభ్రాతృత్వంతో మెలగాలన్నది ఇస్లాం ప్రధాన ఉద్దేశమన్నారు. దీనినే మహ్మద్ ప్రవక్త తన సందేశంగా ప్రజలకు ఇచ్చారన్నారు. దేవునియందు విశ్వాసం ఉంచి రుజుమార్గంలో పయనించాలని కోరారు. దర్గా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ యాసీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో పఠాన్‌పేట ఇమాం మౌలానా జులైద్‌రజా, ఆఫిజ్ అబ్దుల్ రహీం ప్రసంగించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కొల్లూరి చిన్నాకు డాక్టరేట్



డాక్టరేట్‌ను అందుకుంటున్న కొల్లూరి చిన్నా

పెడన: అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్), కొల్లూరి చారిటబుల్ ట్రస్ట్ (కేసీటీ) వ్యవస్థాపకుడు డాక్టర్ కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) ఆదివారం గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. డెస్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ టెక్సాస్ (యూఎస్ఏ) వారు విశాఖపట్నం జిల్లా పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో గాడ్ సన్ హోలీ స్పిరిట్ మినిస్ట్రీస్, గాడ్ సన్ హోలీ స్పిరిట్ థియోలాజికల్ అకాడమీ చైర్మన్ అండ్ డైరెక్టర్ డాక్టర్ ఎంవీ ప్రసాద్, వైస్ చైర్మన్ శ్యామ్సన్, భారతీయ యాదవ మహాసభ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ నమ్మి అప్పలరాజు, హై కోర్ట్ అడ్వకేట్ డాక్టర్ జార్జ్ బంగారి తదితరుల చేతుల మీదుగా చిన్నా డాక్టరేట్ అవార్డును అందుకున్నారు. గత నాలుగు దశాబ్దాలకు పైగా పెడన పట్టణం, పరిసర ప్రాంత పేద ప్రజలకు తన సొంత నిధులతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకుగాను ఈ అవార్డును అందజేశారని చిన్నా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య సామాజికవర్గంలో సేవా రంగంలో రెండు డాక్టరేట్స్ అందుకున్న ఏకైక వ్యక్తి కొల్లూరి చిన్నా కావడం విశేషమని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ, కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం, పెడన మండల ఆర్యవైశ్య సంఘం, పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ క్లబ్, శ్రీ వాసవీ మహిళా మండలి, పెడన మండల హోల్ సేల్ అండ్ రిటైల్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు పలువురు కొల్లూరి చిన్నాను అభినందించారు.

శ్రీసత్యసాయి పర్తియాత్ర విజయవంతం చేయాలి



శిక్షణ పొందుతున్న చిన్నారులు

పెనమలూరు: శ్రీసత్యసాయి పర్తియాత్రను విజయవంతం చేయడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని వక్తలు పిలుపునిచ్చారు. పెనమలూరు శ్రీ సత్యసాయి సేవా సమితిలో ఆదివారం పర్తియాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. డిసెంబరులో 14, 15, 16 తేదీల్లో పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో యాత్ర సాగుతుందని, కృష్ణాజిల్లా పర్తియాత్రను దృష్టిలో ఉంచుకుని ఎంపిక చేసిన విద్యార్థులకు వేదం, భజనలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమితి జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్ మాట్లాడుతూ శ్రీసత్యసాయి పర్తియాత్రకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్తలు డి.మోహన్‌రావు, వి.లక్ష్మీప్రసూన, జిల్లా విద్యా విభాగ సమన్వయకర్తలు ఎ.మురళీకృష్ణ, డి.సాయిజ్యోతి, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఉపాధి' పనులపై ప్రజావేదిక

పెడన: మండల వ్యాప్తంగా 2023–24 ఏడాదిలో జరిగిన మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం ప్రజావేదిక ఉంటుందని పెడన ఎంపీడీవో వీ రెడ్డియ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం పది గంటలకు జరిగే ఈ ప్రజావేదిక కార్యక్రమానికి మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, సమన్వయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాల్సిందిగా ఆయన సూచించారు.

సమాజ సేవకే స్వచ్ఛంద సంస్థ

గుడివాడ టౌన్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సమాజ సేవకు ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ కృష్ణా జిల్లా అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి తెలిపారు. ఆదివారం సేవాసంస్థ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గుండె వ్యాధితో బాధపడుతున్న డి.సరళవేణికి సంస్థ రూ. 5 వేలు అందజేశారు. గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ వి.నవీన్ కుమార్ సేవలకు గాను ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, సీనియర్ జర్నలిస్ట్ బండారు రాధాకృష్ణ, దండమూడి సీతారామస్వామి, నందమూరి పద్మజ, పి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్ : ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామిని భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు ఉదయానికే ఆలయానికి చేరుకోవడంతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. స్వామి వారి పుట్టలో పాలు పోసేందుకు, పాల పొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారు చేసేందుకు అధిక సమయం వేచి ఉండాల్సి వచ్చింది. భక్తులు స్వామిని దర్శించుకున్న అనంతరం నాగబంధాల వద్ద పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సహాయ కమిషనర్ గంగాశ్రీదేవి, సిబ్బంది పర్యవేక్షణ చేశారు.

దంపతులపై దాడి.. నిందితులపై కేసు

ముదినేపల్లి రూరల్ : భార్యాభర్తలపై దాడి ఘటనకు సంబంధించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు మండలంలోని పెదకోమర్రుకు చెందిన వేములవాడ నాగరాజు భార్య మార్తమ్మ కోళ్లకు మేత వేస్తుండగా సరిహద్దున ఉన్న శ్రీదేవి, గన్ని నరస, మరో ఐదుగురు వ్యక్తులు మార్తమ్మపై దాడి చేశారు. దీనిని అడ్డుకోబోయిన ఆమె భర్త నాగరాజుపై సైతం పలుగు, కర్రతో దాడి చేయగా గాయాలపాలై గుడివాడ ఏరియా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రి నుంచి అందిన సమాచారం, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.